రైతు ఆత్మహత్య బాధాకరం

మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జనవరి 18(నమస్తే తెలంగాణ) : బేల మండలంలోని రేణిగూడకు చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు ఆత్మహత్య బాధాకరమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఆదిలాబాద్‌లోని ఐసీఐసీఐ బ్యాంకు అధికారులతో ఆయన చర్చలు జరిపారు. బ్యాంకులో మాటిగేజ్ చేసిన ఐదెకరాల భూమిని విడిపించడంతోపాటు రైతు తీసుకున్న రుణం రూ.3.50 లక్షలను మాఫీ చేయడానికి బ్యాంకు అధికారులు ఒప్పుకున్నట్లు తెలిపారు. దేవ్‌రావు కుమారుడు ఆకాశ్‌కు ఆరు నెలలు శిక్షణ ఇచ్చిన తర్వాత బ్యాంకులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వడానికి అంగీకరించినట్లు పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న రైతు దేవ్‌రావు భార్య వైద్య ఖర్చులకు హెల్త్ ఇన్స్‌రెన్స్ చేయించడానికి అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. బ్యాంకు ద్వారా ఇతర రుణాలను ఇవ్వడానికి కలెక్టర్‌ను సంప్రదించనున్నట్లు తెలిపారు.

సాదాబైనామా.. సాకారమయ్యేనా?

కలగా మారిన యాజమాన్య హక్కులు

● క్రమబద్ధీకరణ ప్రక్రియలో తీవ్ర జాప్యం ● భూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్
● అధికారం చేపట్టి ఏడాది గడిచినా చర్యలు శూన్యం● నిర్మల్ జిల్లాలో 8,272 మంది ఎదురుచూపు

నిర్మల్, జనవరి 18(నమస్తే తెలంగాణ) : తెల్లకాగితాలపై ఒప్పందం ఆధారంగా జరిగిన భూవిక్రయాలకు చట్టబద్ధత కలగానే మారింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణ కోసం జిల్లా రైతులకు ఎదురుచూపు తప్పడం లేదు. 2013 వరకు సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూములకు చట్టబద్ధత కల్పించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం 2020 వరకు విడుతల వారీగా దరఖాస్తులను స్వీకరించింది. వ్యవసాయ భూముల విక్రయాలకు సంబంధించి సాదాబైనామాను రాసుకున్న వారు తక్కువ రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లిస్తే చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ చార్జీలు కలిసొస్తాయనే ఉద్దేశంతో చాలామంది రైతులు సాదాబైనామా కింద దరఖాస్తులు సమర్పించారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడంతోపాటు ఎలాంటి భూ సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు హామీ ఇచ్చింది. అయితే అధికారం చేపట్టి ఏడాది దాటినా రాష్ట్రంలోని రైతుల భూసమస్యలపై ఇప్పటివరకు పరిష్కారం చూపలేదు. ధరణి స్థానంలో భూమాత పోర్టల్‌ను తీసుకొస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అందులో సాదాబైనామాకు ఎలాంటి సమాచారం ఉంచకపోగా, ఆప్షన్ కూడా ఇవ్వలేదని తెలుస్తున్నది. కాగా.. గతంలో ధరణి సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం నిర్వహించిన సదస్సుల్లో కూడా సాదాబైనామా అంశాన్ని ప్రస్తావించలేదు. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం వల్ల వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన వారు పంట రుణాలు, రైతు భరోసా, రైతుబీమా వంటి పథకాలకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాదాబైనామాల సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

క్రమబద్ధీకరణ ఆలస్యమైతే కనీసం తమ భూములకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాపాస్ పుస్తకాలు అందేలా చూడాలని వేడుకుంటున్నారు.

నమ్మకంతో కొనుగోలు..

గతంలో భూముల కొనుగోలు, అమ్మకాలు ఇద్దరి సమ్మతితో సాదాబైనామా ద్వారా జరిగేవి. ప్రస్తుతం భూముల ధరలతోపాటు వివాదాలూ పెరిగాయి. అమ్మకందారులు, కొనుగోలుదారులు నిత్యం పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేయడం సర్వసాధారణమైంది. వీటన్నింటికీ పరిష్కారమార్గం చూపేందుకు సెక్షన్-22(2) మేరకు సాదాబైనామాల క్రమబద్ధీకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2016లో మొదటి సారిగా అవకాశం కల్పిస్తూ క్రయ, విక్రయాలు జరిపిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అలాగే 2020 అక్టోబర్, నవంబర్ నెలల్లో మరోసారి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. వీటి పరిష్కారంపై ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోతుండడంతో పట్టాదారులు, మోకాపై ఉన్నవారి మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.

జిల్లాలో 8,272 దరఖాస్తులు

గతంలో వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చార్జీల భారాన్ని తప్పించేందుకు అనేక విడుతల్లో సాదాబైనామా విధానాన్ని అమలు చేశారు. సాదాబైనామాలకు యాజమాన్య హక్కులను కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. 2019లో రెవెన్యూ చట్టాన్ని సవరించడంతో సాదాబైనామాల అంశం కోర్టుకు చేరింది. దీంతో జిల్లాలోని 19 మండలాల నుంచి 8,272 దరఖాస్తులు వచ్చాయి. సాదాబైనామాలకు చట్టబద్ధత ఎలా కల్పిస్తారని కోర్టు ప్రశ్నించగా.. అప్పటి ప్రభుత్వం చివరి సారిగా సాదాబైనామాలకు అవకాశం కల్పించాలని విన్నవించింది. అందుకు అనుగుణంగా మార్గదర్శకాలను జారీ చేసే క్రమంలోనే ఎన్నికలు రావడంతో అది పెండింగ్ పడింది. ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించి, ఏళ్లుగా కొనసాగుతున్న వివాదాల నుంచి రైతులను గట్టెక్కించాలని పలువురు కోరుతున్నారు.

సాదాబైనామా చట్టబద్ధత కోసం వచ్చిన దరఖాస్తులు

మండలం	సంఖ్య
మామడ	1,042
కడెం	879
దస్తురాబాద్	789
లోకేశ్వరం	669
ముథోల్	640
కుభీర్	576
బిలావర్‌పూర్	572
లక్ష్మణచాంద	569
సారంగాపూర్	561
నిర్మల్ రూరల్	460
ఖానాపూర్	323
సోన్	280
కుంటాల	273
నర్సాపూర్(జి)	245
భైంసా	172
పెంబి	66
తానూర్	63
బాసర	57
నిర్మల్(అర్బన్)	36

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు

క్వింటాలు పత్తికి రూ.100 కోత

ధర తగ్గించిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

● నాణ్యతను సాకుగా చూపుతున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ
● గతంలో తేమ పేరిట కొనుగోళ్ల నిరాకరణ ● నష్టపోతున్న రైతులు

ఆదిలాబాద్, జనవరి 18(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిర్వాకం ఫలితంగా ఆదిలాబాద్ జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. రైతులు నష్టపోకుండా పత్తి పంటను కొనుగోలు చేయాల్సిన సీసీఐ వ్యాపార ధోరణితో వ్యవహరిస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సీజన్ ప్రారంభంలో తేమ అధికంగా ఉందంటూ కొనుగోళ్లను నిరాకరించిన సీసీఐ, ఇప్పుడు నాణ్యత తగ్గిందంటూ ధరను తగ్గించింది. మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ఉండగా.. ఏకంగా రూ.100 తగ్గించి రూ.7421తో కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రైవేటులో కూడా పత్తి ధరలు తక్కువగా ఉండడంతో రైతులు సీసీఐకి పంటను అమ్ముకోవాల్సి వస్తున్నది. నాణ్యత పేరిట ధరలో కోత విధిస్తుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము నాణ్యమైన పత్తిని తీసుకొస్తున్నా.. మద్దతు ధర దక్కడం లేదంటున్నారు. ధర తగ్గించడం విషయంలో మార్కెటింగ్ శాఖ అధికారులను అడిగినా ఫలితం లేదని చెబుతున్నారు.

దక్కని మద్దతు ధర

ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వానకాలంలో 3.85 లక్షల ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. 40 లక్షల క్వింటాళ్లు విక్రయానికి వస్తుందని అంచనా వేసిన అధికారులు సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండున్నర నెలలుగా పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521తో కొనుగోళ్లు ప్రారంభించారు. 8 శాతం తేమతో పది రోజుల క్రితం వరకు ఈ ధరతో సీసీఐ కొనుగోలు చేసింది. నాణ్యత పేరిట జనవరి 2 నుంచి ధరను రూ.50 తగ్గించి రూ.7,471తో కొనుగోలు చేశారు. దూది పింజ పొడవు సరిగా రాకపోవడంతో సీసీఐ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రకటించారు. రెండు రోజులుగా క్వింటాలుకు మరో రూ.50 తగ్గించి కొనుగోళ్లు జరుపుతున్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.100 కోత విధించి సీసీఐ పంటను సేకరిస్తుండడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకున్నది.

వ్యాపార సంస్థలా వ్యవహరిస్తున్న సీసీఐ

నేను ఆరెకరాల్లో పత్తి సాగు చేశా. పంటను విక్రయించడానికి ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు వస్తే ధర రూ.100 తగ్గిందని మార్కెటింగ్ సిబ్బంది అంటున్నారు. సీజన్ ప్రారంభంలో తేమ ఎక్కువగా ఉందని పత్తిని కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్మి నష్టపోవాల్సి వచ్చింది. ఇప్పుడు నాణ్యత పేరిట మద్దతు ధర కంటే తక్కువ చెల్లిస్తున్నారు. రైతులను ఆదుకోవాల్సిన సీసీఐ వ్యాపార సంస్థల వ్యవహరిస్తుండడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. - భూమన్న, రైతు, భోరజ్, జైనథ్ మండలం

నాణ్యమైన పత్తిని తీసుకొచ్చినా ధర రాలేదు..

నేను ఐదెకరాల్లో పత్తి సాగు చేశా. కూలీల కొరత కారణంగా పంటను తీయడంలో జాప్యం జరిగింది. మొదటిసారి తీసిన పత్తిని విక్రయించడానికి ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు 15 క్వింటాళ్లు తీసుకొచ్చా. పంట నాణ్యతగా లేదని సీసీఐ అధికారులు రూ.100 తగ్గించి క్వింటాలుకు రూ.7,521తో కొనుగోలు చేస్తున్నారు. మంచి నాణ్యతతో కూడి తేమ లేకుండా ఉన్నా తక్కువ ధర చెల్లించడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. ప్రైవేటులో అమ్ముకుందామంటే ధర తక్కువగా ఉంది. అధికారులు స్పందించి రైతులకు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలి.
- సుభాష్, రైతు, పిప్పల్‌గాం, జైనథ్ మండలం

బాలుడి హత్య

రిషి(ఫైల్)

సోన్, జనవరి 18 : నిర్మల్ మండలంలోని చిట్యాల్ గ్రామానికి చెందిన అడ్డిగ రాజమణి ఆమె 12 ఏండ్ల కుమారుడు రిషిలు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజమణి భర్త ప్రభాకర్ పదేండ్ల క్రితం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడిని పోషించుకుం టూ జీవనం సాగిస్తున్నది. ఈ క్రమంలో శుక్రవా రం కూడా తల్లీకుమారుడు కూడా ఇద్దరు వేర్వేరు చోట్ల కూలీ పనులకు వెళ్లారు. తల్లి ఇంటికి రాగా.. కుమారుడు రిషి రాత్రి 11 గంటలు అయినా రాలేదు. శనివారం ఉదయం చిట్యాల్ గ్రామ శివారులో చింతల చెరువు వైపు వెళ్లిన వారు రిషి మర్మాంగాలపై బండరాయితో దాడి చేసి హత్య ఉండడాన్ని గమనించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. బాలుడి మృతదేహాన్ని చూసిన ఆ తల్లి రోదనలు మిన్నంటాయి. ఒక్కగానొక్క కొడుకు దూరమయ్యే సరికి ఆ తల్లి బాధ వర్ణణాతీతం. ఘటనా స్థలాన్ని ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించి వివరాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దుండగులను త్వరలోనే పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ఎదులాపురం/నిర్మల్ అర్బన్, జనవరి 18 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,170 మంది విద్యార్థుల కోసం పట్టణంలో 3, ఉట్నూర్, ఇచ్చోడలో ఒకటి చొప్పున ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 నుంచి పరీక్ష ప్రారంభం కాగా గంట ముందుగానే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష పూర్తవగా 1,170 మంది విద్యార్థులకు 962 మంది హాజరయ్యారు. 208 మంది గైర్హాజరయ్యారు. డీఈవో ప్రణీత కేంద్రాలను సందర్శించారు.

నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ జిల్లావ్యాప్తంగా 1,479 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా.. వీరికి నిర్మల్‌లో 3, భైంసాలో 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,479 మంది విద్యార్థులకు 1,310 మంది హాజరు కాగా.. 169 మంది గైర్హాజరయ్యారు. నిర్మల్ పట్టణంలోని సెయింట్ థామస్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి రామారావు తనిఖీ చేశారు. అలాగే మంజులాపూర్‌లోని విజయ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ద పద్మ తనిఖీ చేశారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

క్రీడలతోపాటు చదువుపై దృష్టి సారించాలి

బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్

ఇంద్రవెల్లి, జనవరి 18 : గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఆటల పోటీల్లో పాల్గొంటూనే ఉన్నత చదువులపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. శనివారం ఏమాయికుంట గ్రామానికి చెందిన ఈగల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పోటీలు ఏర్పాటు చేయడంతో స్నేహభావం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్ డోంగ్రే, మాజీ ఎంపీపీ పోటే శోభాబాయి, మాజీ ఎంపీటీసీ మడావి భీంరావ్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు అమ్జద్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మిర్జా జిలానీ బేగ్, బీఆర్ఎస్ పార్టీ మండల కో-ఆర్డినేటర్ షేక్ సుఫియాన్, మాజీ సర్పంచ్‌లు జాదవ్ లఖన్‌సింగ్, జాదవ్ జమునాయక్, ఇంద్రవెల్లి మాజీ ఉప సర్పంచ్ గణేశ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పుర్కా చిత్రు, శివాజీ, ధరణి ధన్‌రాజ్, జాదవ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

దర్భతండాలో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

గ్రామాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్తా..

నేరడిగొండ, జనవరి 18 : ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం దర్భతండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణం, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో పర్యటిస్తూ ముందుకెళ్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్యే నివాసంలో పలు గ్రామాల ప్రజలు సీసీ రోడ్లు నిర్మించాలని విన్నవించారు. వారం రోజుల్లో గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉప్పు పోశెట్టి, నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, సుజిల్, సీతారాం, గులాబ్ సింగ్, ఫయాజ్, భూషణ్, శ్రీకాంత్, రాజేశ్వర్, కరణ్‌సింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, పంచాయతీ కార్యదర్శి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పనులు పూర్తి చేయాలి

● ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్ ● రేషన్ కార్డు, రైతు భరోసా ఫీల్డ్ వెరిఫికేషన్ తనిఖీ

కుంటాల, జనవరి 18 : కుంటాల మండల కేంద్రంలోని పశువైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ భవనం మరమ్మతులు పూర్తి చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. త్వరగా రిపేర్ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రిజిస్టర్లను పరిశీలించి వైద్యులకు సూచనలు చేశారు. డ్రగ్స్ స్టోర్ రూమ్‌ను పరిశీలించి గడువు తీరిన మందులను తీసివేయాలని రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం పౌర సేవా కేంద్రం, గ్రంథాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల క్షేత్రస్థాయి పరిశీలనను పరిశీలించారు. కుంటాల మండలం లింబా (కే) గ్రామంలో సర్వే బృందాలు క్షేత్ర స్థాయి పరిశీలన జరుపుతున్న తీరును తనిఖీ చేశారు. గ్రామ శివారులోని ఆయా సర్వే నెంబర్లలో గల రైతులకు సంబంధించిన పట్టా భూములను అసైన్డ్ స్థలాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన సందర్భంగా సేకరించిన వివరాలను రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. త్వరితగతిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్దిదారుల జాబితా రూపొందించాలని అధికారులకు ఆమె ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 20 తేదీ నాటికి ఆయా పథకాల కింద అర్హులైన వారి జాబితాను రూపొందించి 21 నుంచి 24వ తేదీ వరకు ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, మండల ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో నిర్వహించనున్న గ్రామ సభల్లో ప్రవేశపెట్టి లబ్ధిదారుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. కలెక్టర్ వెంట భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, డీపీవో శ్రీనివాస్, డీఎవో అంజీప్రసాద్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, తహసీల్దార్ ఎజాజ్, ఎంపీడీవో లింబాద్రి ఉన్నారు.

కుంటాల పీహెచ్‌సీలో అధికారులకు సూచనలు చేస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

పదిలో మంచి మార్కులు సాధించాలి

● తల్లిదండ్రులతో టెలి కాన్ఫరెన్స్
● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జనవరి 18 : పదో తరగతిలో మంచి మార్కులు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే నెలన్నర రోజులు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి, చదువుపై దృష్టిసారించేలా చూడాలని అన్నారు. ఉదయం 5 గంటలకే నిద్ర లేపి చదువుకోవాలని చెప్పాలని, పరీక్షలు అయ్యేంతవరకు వేరే పని చెప్పకూడదని సూచించారు. విద్యార్థులు టీవీ, మొబైల్ చూడకూడదని పేర్కొన్నారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పని తీరును కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ప్రణీత, డీసీబీ సెక్రటరీ గజేందర్, ఆరోగ్య పాఠశాల అనుసంధాన కర్త అజయ్ పాల్గొన్నారు.

టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

సివిల్ కానిస్టేబుల్స్‌కు శిక్షణ పూర్తి

ఎదులాపురం, జనవరి 18 : జిల్లాకు నూతనంగా వచ్చిన 145 మంది కానిస్టేబుల్స్ మూడు వారాల శిక్షణను పూర్తి చేసుకున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. శనివారం పోలీసు హెడ్ క్వార్టర్లలోని సమావేశ మందిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్‌తో సమావేశం నిర్వహించారు. శిక్షణలో భాగంగా సిబ్బంది కోర్టు డ్యూటీ, రిసెప్షన్, పిటిషన్ మేనేజ్‌మెంట్ విధులు, బ్లూ కోర్ట్, డయల్ 100, పెట్రోలింగ్, బిట్ సిస్టం, అనుమానితులను పరిశీలించడం, నేర నియంత్రణ, నేర పరిశోధన, సీసీ టీఎన్ఎస్, సైబర్ క్రైమ్, సీఈఐఆర్, ముఖ్యంగా ప్రమాదాల సమయంలో ప్రజలను కాపాడేందుకు ఉపయోగపడే సీపీఆర్ పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డబ్ల్యూ పీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌లను ఎస్పీ అభినందించారు.

మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం